


# ఏయూ లుక్స్

తెలుగు వార పత్రిక

ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్

**ANDHRA UNIVERSITY**
Accredited by NAAC With 'A++' Grade
ISO 2001:2015 Certified

aulooks@andhrauniversity.edu.in
aulooksvizag2019@gmail.com
ఫోన్ : 0891-2844000

JANUARY 28 - 03, 2024

Chief Patron : Prof. P.V.G.D. Prasad Reddy | Chief Editor Prof. K.Samatha | Publisher : Prof. M.James Stephen

సంపుటి : 2 | సంచిక : 103 | పేజీలు : 8


# ఏయూ ఆధునిక ప్రగతి సారథి..

# ఆచార్య ప్రసాదరెడ్డి





- రెండవ సారి ఏయూకు వీసీగా ఎంపికై సరికొత్త రికార్డ్
- 98 ఏళ్ల వర్సిటీ చరిత్రలో ఈ ఘనత సాధించిన 2వ వీసీగా గుర్తింపు
- నాలుగేళ్లలో ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రగతిపై చెరగని ముద్ర
- ఉన్నత విద్యాభివృద్ధిపై సీఎం ఆకాంక్ష అనుగుణంగా ముందడుగు
- ప్లేస్‌మెంట్స్, ఆవిష్కరణలే లక్ష్యంగా విద్యార్థులకు చురుకైన మార్గనిర్దేశం
- ఐఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలకు దీటుగా ఏయూలో స్టార్టప్ కల్చర్ అభివృద్ధి
- వర్సిటీ అభివృద్ధి, నాక్ టాప్ ర్యాంకింగ్‌తో సీఎం మనసుగెలిచిన వైనం
- దీంతో 2వ సారి వీసీగా నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- రానున్నది వర్సిటీకి స్వర్ణయుగమేనంటున్న వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు
- వందేళ్ల సంబరాలకు ఆసక్తిగా ఎదురుచూస్తున్న వర్సిటీ వర్గాలు

విలక్షణమైన వ్యక్తిత్వం..
చురుకైన నిర్ణయాలు..
సమర్థ పాలన నైపుణ్యం..
అసాధారణ విజనరీ..
ఊహాకందని భవిష్యత్ ప్రణాళిక..
అద్భుత విజయాలకు కేరాఫ్..

ఇదీ.. ఆచార్య ప్రసాదరెడ్డి అంటే. బహుముఖ ప్రతిభానైపుణ్యానికి నిలువుటద్దం ఆయన. సాధారణంగా ఏ వ్యక్తికైనా పైవాటిలో సాధ్యమయ్యేవి కొన్ని సుగుణాలే. అయితే దానికి ఆచార్య ప్రసాదరెడ్డి అతీతం. పని ఏదైనా అనుకున్నది సాధించడమే ఆయన నైజం. అసాధారణమైన విజనరీకి ఆయన కేరాఫ్. భవిష్యత్తు ప్రపంచాన్ని ముందే గుర్తించి అందుకనుగుణంగా వ్యవస్థలను నడిపించడంలో ఆయన దిట్ట. ఇలాంటి అరుదైన పాలన నైపుణ్యంతో గత నాలుగేళ్లలో ఆయన ఏయూలో చేసిన సంస్కరణలు ఎన్నో. ఏయూ గతిని మార్చేలా ఆయన సాధించిన ఘనతలు మరెన్నో. దశాబ్దాలుగా తిష్టవేసిన సమస్యలను అధిగమించి.. ఉన్న వనరులనే సమర్థవంతంగా వినియోగిస్తూ ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని నాక్ లో 3.74 ర్యాంక్ ముంగిట నిలిపిన తీరు అసాధారణం.

మరోసారి ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన ఆయన.. తన విలక్షణమైన పరిపాలన నైపుణ్యంలో సాధించిన ఘనతలపై ఏయూ లుక్స్ ప్రత్యేక కథనం.

## పదవీ విరమణ వయస్సు పెంపుపై ఉద్యోగులు హర్షం



**ఏయూ న్యూస్, ఫిబ్రవరి :** రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఏయూ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏయూ ఉద్యోగులంతా వర్సిటీలోని వైయస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి **తరువాయి 7 లో**

## స్టార్టప్ రంగంలో ఏయూ ప్రగతి




**ఏయూ న్యూస్, జనవరి :** స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలలో ఏయూ వేగంగా ప్రగతి సాధిస్తోందని పర్డు యూనివర్సిటీ ఎంటర్‌ప్యూనర్‌షిప్ ప్రోగ్రావమ్ కన్సల్టెంట్ జూలియాన కాసవాన్ అన్నారు. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డితో ఆమె మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గత కొన్నేళ్లుగా ఏయూ ఆ హబ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలలో భాగస్వామిగా నిలిచి నట్లు వీసీ ఆచార్య **తరువాయి 5 లో**



## ఆ ఐడియాలజీతో.. ముందుకు నడపలేం..

**ఓ సందర్భంలో.. వీసీ సందేశం**

మిషన్ ఇంటిలిజెన్స్ విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో పాతకాలపు విధానాలకు విశ్వవిద్యాలయాలు స్వస్తి పలకాల్సిన అవసరముంది. అతిత్వరలోనే ఇంటర్నేట్ సేవలు తన రూపాన్ని మార్చుకోబోతున్నాయ్. మెటా బేసిడ్ టెక్నాలజీకి ఫేస్‌బుక్ లాంటి సంస్థలు మార్పు చెందబోతున్నాయ్. డిజిటల్ కంటెంట్ ప్రాముఖ్యత పెరిగింది. డిజిటైజేషన్ అండ్ డిజిటలైజేషన్ అంశాల్లో 5 నుంచి 10 ఏళ్లలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో 19వ శతాబ్ధపు ఐడియాలజీతో, ఇన్ఫ్రాస్టక్చర్‌తో విశ్వవిద్యాలయాలను ముందుకు నడిపించలేం. విద్యార్థుల భవిష్యత్‌కు వందశాతం న్యాయం చెయలేం. ఉన్నత విద్యాభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు వేల కోట్లు వెచ్చిస్తోంది. ఈ వనరులను వినియోగించుకొనే క్రమంలో విశ్వవిద్యాలయాలు పాత విధానాలకు స్వస్తిపలకాల్సిన అవసరముంది. ఉన్నత విద్యావ్యాప్తిలో వినూత్న పద్ధతులను అవలంభించాల్సిన అవసరముంది. 21వ శాతాబ్ధపు డిజిటల్ యుగానికి, యువత ఆలోచనా సరళికి అనుగుణంగా విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సివుంది. స్టూడెంట్స్ యాక్టివిటీస్, రీసెర్చ్, డవలప్‌మెంట్ యాక్టివిటీస్, ప్రాజెక్ట్స్, స్టార్టప్స్, ఆన్‌లైన్ కోర్సెస్ ఇలా అన్నింటా మల్టిడైమెన్షనల్ ఛేంజెస్ తీసుకురావాలి. ఇందుకు అనుగుణంగా ప్రతిష్టాత్మక ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీగా ప్రతి అడుగు వర్సిటీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వేయడం జరుగుతుంది.






## సీఎం ఆకాంక్షకు కార్యరూపం

ఉన్నత చదువును పూర్తి చేసుకుని ప్రతి విద్యార్థి మంచి జాబ్ తోనో... జాబ్ క్రియేటర్ గానో.. క్యాంపస్ వదిలి వెళ్లాలంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన దిశానిర్దేశానికి రూపం ఇచ్చిన ఘనత ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రసాదరెడ్డికి దక్కుతుంది. 2019లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వచ్చిన సందర్భంగా తన ప్రసంగం ద్వారా ఆయన చేసిన దిశ నిర్దేశాన్ని వీసీ ప్రసాద్‌రెడ్డి తూచతప్పకుండా పాటించారు. ప్రతి కుటుంబానికి మనం ఇచ్చే ఆస్తి విద్య మాత్రమే అనే విషయాన్ని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు అనుక్షణం గుర్తుంచుకోవాలంటూ ముఖ్యమంత్రి ఉన్నత విద్య మండలి సమావేశంలో చేసిన సూచనలకు కార్యరూపమిచ్చారు. ఒక పక్క వర్సిటీని ఆధునీకరిస్తూనే, ఇన్ఫ్రాస్టక్చర్‌ను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నారు. ప్రతీ క్యాంపస్ కళాశాల పరిధిలో విద్యార్థుల కోసం ప్లేస్‌మెంట్ సెల్స్ అందుబాటులోకి తెచ్చారు. ఉన్నత చదువు కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థిని ప్రయోజకున్ని చేసే విధంగా 100 శాతం కృషి చేస్తున్నారు. అఛీవర్స్ డే సందర్భంగా ఆయా విద్యార్థుల తల్లిదండ్రుల చేతుల మీదగానే వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసే వినూత్న కార్యక్రమానికి వీసీ శ్రీకారం చుట్టారు. క్యాంపస్ కళాశాలల విద్యార్థుల సామర్థ్యానికి, అభిరుచికి అనుగుణంగా ఉద్యోగాల కల్పనకు బాటలు వేస్తున్నారు. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చిన విద్యార్థులను ఆవిష్కరణలు దిశగా ప్రోత్సహిస్తున్నారు. మ్యుజిక్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం సెయింట్ లూక్స్ మ్యుజిక్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా టీకాబ్స్-ఈ వంటి సెంటర్ల ద్వారా పరిశోధనల్లో ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులను పరిశ్రమలకు అనుసంధానం చేసే దిశగా 20కి పైగా పారిశ్రామిక సంస్థలకు చెందిన ఇండస్ట్రీయల్ ఛైర్స్‌ను ఏయూలో నెలకొల్పారు. ఆవిష్కరణలు పెంచడంతో పాటు పేటెంట్ల సాధన దిశగా ఆచార్యులను, పరిశోధకులను ప్రోత్సహిస్తున్నారు. ఈ దిశగా గత నాలుగేళ్లుగా జరిగిన కృషి ఫలితంగా నాక్‌లో 3.74 రేటింగ్‌తో ఏ ప్లస్ ప్లస్ ర్యాంకు సాధించి సీఎం ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు జాతీయ స్థాయిలో ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఎనలేని కీర్తిన అందించారు.






## 98 ఏళ్ల చరిత్రలో.. రెండవ వీసీ




ఆంధ్ర విశ్వవిద్యాలయం 1926లో మద్రాసు ప్రావిన్సీ విశ్వవిద్యాలయ చట్టం ద్వారా ఆవిర్భవించింది. 425 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన బహిరంగ ప్రదేశాలు, అద్భుతమైన పర్యావరణ వ్యవస్థతో విశాఖపట్నం నగరంలో బంగాళాఖాతం ఒడ్డున ఠీవీగా ఈ సువిశాల విశ్వవిద్యాలయం కొలువుదీరింది. ఈ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక వైస్-ఛాన్సలర్‌గా సర్ కట్టమంచి రామలింగారెడ్డి వ్యవహారించారు. భవిష్యత్‌కు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటూ విశ్వవిద్యాలయం బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏయూకు 2వ వైస్-ఛాన్సలర్‌గా సేవలు అందించారు. భారతావనికి స్వాతంత్ర్యం సిద్దించిన తరువాత ఎంతో మంది మేధావులను, విజ్ఞానవంతులను ఏయూ దేశానికి అందించింది. అయితే 98 ఏళ్ల వర్సిటీ చరిత్రలో ఇప్పటి వరకు రెండు పర్యాయాలు వీసీగా సేవలు అందించిన ఘనత ముగ్గురు వైస్-ఛాన్సలర్‌లకు మాత్రమే దక్కింది. ఇందులో వర్సిటీ వ్యవస్థాపక వీసీ సర్ సీఆర్ రెడ్డి వేరు వేరు సందర్భాల్లో రెండు సార్లు వీసీగా సేవలు అందించారు. అయితే వరుసగా రెండు పర్యాయాలు వీసీలుగా సేవలు అందించిన ఘనతను ఇద్దరు వైస్-ఛాన్సలర్లు మాత్రమే దక్కించుకున్నారు. ఈ విశిష్టమైన ఘనతను సాధించిన ఇద్దరిలో ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి ఒకరిగా నిలిచారు. గతంలో మద్ది గోపాలకృష్ణారెడ్డి వరుసగా 2 సార్లు ఏయూకు వైస్-ఛాన్సలర్‌గా సేవలు అందించగా ఆయని తరువాత ఆచార్య ప్రసాదరెడ్డి ఆ ఘనతను సొంతంచేసుకొని రికార్డు సృష్టించారు. వర్సిటీతో పాటు విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖుల మన్ననలు అందుకున్నారు.

# ఐఐటీలకు దీటుగా.. స్టార్టప్ కల్చర్












ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులను ఆవిష్కర్తలుగా, భవిష్యత్ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే వేదికగా ఆ- హబ్‌ని తీర్చిదిద్దారు.ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు దీటుగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి భవిష్యత్ విజన్‌తో ఈ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇంజినీరింగ్ కళాశాలలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.21 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. దీనిలో ఇప్పటికే 204 స్టాప్టప్‌లు పనిచేస్తుండగా వీటిలో 114 వరకు స్టార్టప్ సంస్థలు ఆర్థిక వనరులను సృష్టించే స్థాయికి చేరుకున్నాయి. దీంతో పాటు విద్యార్థులు ఆవిష్కరణలను మరింత మెరుగుపరచుకునేందుకు ఇంజినీరింగ్ కళాశాల మైదానాన్ని ఆనుకొని ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో నూతన ఆవిష్కరణలకు ఏయూను కేంద్రంగా నిలపాలనే లక్ష్యంతో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేసే విధంగా ప్రత్యేత సెంటర్ అందుబాటులోకి తెచ్చారు. బ్లూటూత్ సాంకేతికతతో పనిచేసే డ్రోన్లు, నావికాదళ నావిగేషన్ సిస్టంకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా సేవలు అందించేందుకు బ్లూటూత్ సిగ్నల్ తో కూడిన డ్రోన్లును, తారా మండల్ స్పేస్ ప్రోగ్రామ్‌ను ఇక్కడ విద్యార్థులు అభివృద్ధి చేస్తున్నారు. రిమోట్, మాన్యువల్‌గా పనిచేసే రోబోట్ ఆవిష్కరణలు జరుగుతున్నాయి. దీంతో పాటు నాస్కాం, లో కోడ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, డిజీప్యాక్ వంటి సంస్థల ద్వారా విద్యార్థుల్లో4 ఐటీ టెక్నాలజీ, నైపుణ్యం పెరుగుదలకు శిక్షణలు అందిస్తున్నారు. దీంతో పాటు విద్యార్థులను పారిశ్రమలతో అనుసంధానం చేయాలనే లక్ష్యంతో 20కి పైగా ఇండస్ట్రీయల్ ఛైర్స్‌ను క్యాంపస్‌లో నెలకొల్పారు. భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకొనే నైపుణ్యాన్ని అందించడంతో పాటు ఆవిష్కరణలు దిశగా విద్యార్థులను ముందుకు నడిపిస్తున్నారు.

# విశ్వవిద్యాలయానికి డిజిటల్ హంగులు

ఆచార్య ప్రసాద్‌రెడ్డి ఏయూ వీసీగా తన మార్కు అభివృద్ధిని చూపించారు. ప్రస్తుత ఆధునిక యుగానికి అనుగుణంగా 98 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆంధ్రవిశ్వవిద్యాలయానికి డిజిటల్ హంగులు అద్దారు. నాలుగేళ్లలో అసాధరణ విజనరీతో వర్సిటీకి కార్పోరేట్ లుక్ తీసుకొచ్చారు. వందేళ్ల క్రితం నిర్మించిన చారిత్రాత్మక వర్సిటీ సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఒక్కసారిగా కార్పోరేట్ లుక్‌లోకి మార్చి వర్సిటీ వర్గాలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. దశాబ్దాల చరిత్రతో పాటు దేశంలోని టాప్ లైబ్రరీల్లో ఒకటిగా ఉన్న ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ సెంట్రల్ లైబ్రరీలోని ప్రాచీన తాళపత్ర గ్రంథాలను డిజిటలైజ్ చేసి అంతర్జాతీయంగా ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తెచ్చారు. నాలుగేళ్లలో వర్సిటీలో పెద్ద ఎత్తున సాంకేతికంగా మార్పులు తీసుకొచ్చారు. అన్ని విభాగాల్లో ఈ- క్లాస్‌రూమ్స్, ప్రొజక్టర్స్ అందుబాటులోకి తెచ్చారు. పదుల సంఖ్యలో విద్యార్థుల వసతిగృహాలను నాడు- నేడు నిధులతో అత్యంత సుందరంగా ఆధుకరించారు. దశాబ్దాల చరిత్ర ఉన్న ఏయూలోని డాక్టర్ గోపాలస్వామి ఆరుబయలు రంగస్థలాన్ని అత్యధునికంగా తీర్చిదిద్ది డాక్టర్ గోపాలస్వామి ఆంఫిథియేటర్‌గా మార్చారు. దీంతో పాటు ప్రతిష్టాత్మక ఆమెరికన్ కార్నర్ ఏర్పాటు, విద్యార్థులకు వివిధ అంతర్జాతీయ వేదికలను ఆన్‌లైన్ ద్వారా పరిచయం చేస్తూ వారు సబ్జెక్ట్ నాలెడ్జి పెంచుకునేందుకు, ఇతర దేశాల నిపుణులు, విద్యావేత్తలతో సంభాషణలు చేసేందుకు కృషి. ఐఐఎంలకు దీటుగా ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఏర్పాటు, అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడంతో పాటు వరల్డ్‌క్లాస్ ఎడ్యుకేషన్ దిశగా సేవలు. భవిష్యత్ ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఆల్గారిథం పేరిట ఆన్‌లైన్ సేవల సెంటర్, విదేశీ విద్యార్థులకు అత్యధునిక హంగులతో వసతిగృహాలు నిర్మాణం. విద్యార్థుల మానసిక స్థితిని తెలుసుకోవడంతో పాటు ఒత్తిడిని దూరం చేసే విధంగా కాగ్నిటీవ్ థెరపీ వైద్య సేవలు. భారత త్రివిధ దళాల్లో సేవలు అందించిన ఉద్యోగులను ఉన్నత విద్యలో ప్రోత్సహించే విధంగా విలువైన సేవలు. దేశంలో మరో వర్సిటీలో లేనంతగా ప్రత్యేక కోర్సుల్లో శిక్షణకు ఏయూ సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ ద్వారా విశిష్ట సేవలు అందిస్తున్నారు.















# భవిష్యత్తు విజనరీ ప్రాజెక్టులు

ఆచార్య ప్రసాద్ రెడ్డి వీసీగా 2వ సారి నియమితులు కావడంతో వచ్చే మూడేళ్ల వర్సిటీ అభివృద్ధిపై పెద్ద ఎత్తున అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయం అభివృద్ధికి పలు భవిష్యత్ ప్రాజెక్టులను సిద్దంచేశారు. ఇందులో ప్రధానంగా రూ.60 కోట్ల ఎన్‌టీపీటీ అవగాహన ఒప్పందం ప్రధానమైంది. ఈ ఒప్పందంలో భాగంగా వర్సిటీలో ఆధునాతన మౌళిక వసతులతో కూడిన స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తేనున్నారు. 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణాలు జరగనున్నాయి. దీంతో పాటు రూ.37 కోట్లుతో మల్టీలెవల్ స్పోర్ట్స్ కాంప్లక్స్ నిర్మాణం. వర్సిటీ మైదానంలో దీన్ని నిర్మించనున్నారు. సింథటిక్‌ట్రాక్, సిమ్మింగ్‌పూల్, పలు క్రీడా ప్రాంగణాలు ఈ స్పోర్ట్స్ కాంప్లక్స్ నిర్మాణంలో భాగంగా ఉండనున్నాయి. రూ.1.4 కోట్లుతో మెడిటేషన్ సెంటర్ అందుబాటులోకి రానుంది. మహాబోధి సొసైటీ ద్వారా మేకపాటి గౌతమ్ రెడ్డి పేరుమీద నిర్మించనున్న ఈ సెంటర్ సేవలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి బాటలు వేయనున్నాయి. దీంతో పాటు ఫార్మా ఇంక్యుబేషన్, బయోలాజికల్ మానిటరింగ్ హబ్ (ఎలిమెంట్) సేవలు భవిష్యత్ ప్రగతికి కీలకం కానున్నాయి. దాదాపు 55 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫార్మా, బయో, జినోమిక్స్ ఇంక్యుబేషన్, టెస్టింగ్ ల్యాబ్‌గా దీనిని రూ.44 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఔషధ రంగంలో నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ ఇన్నోవేషన్ ప్రధాన లక్ష్యంగా విద్యార్థులను, యువ పరిశోధకులను ప్రోత్సహించే విధంగా ఏయూ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ఎలిమెంట్ లేబరేటరీ విశేష సేవలందించనుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుసంధానంగా ఉన్న 33 ఫార్మసీ కళాశాలను కలుపుతూ ఈ ఎలిమెంట్ సేవలను విస్తరించనున్నారు. ఏజెంట్, సురక్ష, లీ ఫార్మా కంపెనీలు త్వరలోనే వాటి కార్యక్రమాలు ప్రారంభించనున్నాయి. రూ.12 కోట్లు వ్యయంతో చేపట్టిన సెయింట్ లూక్స్ మ్యూజిక్ సెంటర్ సేవలు కీలకం కానున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.3.5 కోట్లతో తొలి దశ పనులు, రూ.4.5 కోట్లతో రెండో దశ పనులు పూర్తయ్యాయి. ఏయూ, సెయింట్ లూక్స్ కలిసి ఈ ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు వీడియో సౌండ్ ఇంజనీరింగ్, ఎడిటింగ్ కోర్సులు అందిస్తున్నారు.






# వందేళ్ల ఉత్సవానికి.. పర్‌ఫెక్ట్ కాంబినేషన్




1926లో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. ఈ ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం వందేళ్ల పండక్కి ఇంకా ఏడాది సమయమే ఉంది. 2025 ఏప్రిల్ నుంచి ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీకి సమర్థవంతమైన అడ్మినిస్ట్రేషన్ అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్‌ల కాంబినేషన్‌పై వర్సిటీ వర్గాలు పూర్తి విశ్వాసంతో ఉన్నాయి. వందేళ్ల ఉత్సవానికి వర్సిటీకి మంచి జోడి కుదిరిందని వర్సిటీతో పాటు విశాఖ నగర ప్రజలు ఆనందోత్సాహం వ్యక్తం చేస్తున్నారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి విజనరీ అడ్మినిస్ట్రేషన్, గత నాలుగేళ్లలో ఏయూకి అందించిన ప్రగతి గురించి అందరికీ తెలిసిందే. అయితే చురుకైన పనితీరు, వర్క్ డెడికేషన్ కలిగిని ఆచార్య జేమ్స్ స్టీఫెన్ ఆయనకు తోడవడంతో వందేళ్ల పండగాపై వర్సిటీలో భారీ అంచనాలు ఉన్నాయి. సరిగ్గా నాక్ పర్యటన ముందు ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్న ఆచార్య జేమ్స్ స్టీఫెన్ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి విజన్‌కు అనుగుణంగా ఏయూ పాలన యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. నాక్ బృందం ఎదుట సామర్థ్యానికి మించి బెస్ట్ ఫెర్‌ఫార్మన్స్ ఇవ్వడమే లక్ష్యంగా వ్యవస్థలను సిద్ధం చేశారు. సమయపాలన చూడని వర్క్‌డెడికేషన్‌తో తక్కువ సమయంలో అంచనాలకు మించిన సేవలు అందించి అత్యుత్తమ ర్యాంకు సాధనలో కీలకంగా నిలిచారు.ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఛైర్.. ఛైర్ ప్రొఫెసర్‌గాను వర్సిటీ నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు, స్నాతకోత్సవాల్లో క్రియాశీలకంగా వ్యవహారించి ఆయా కార్యక్రమాల సక్సెస్‌కు కేరాఫ్‌గా నిలిచారు. ఈ నేపథ్యంలో వర్సిటీ వందేళ్ల వేడుక వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌ల సారథ్యంలో జరగనుండటంతో ఆ వేడుకపై వర్సిటీలో భారీ అంచనాలు, సర్వత్రా ఆసక్తి నెలకొంది.

---

## యువతకు నైపుణ్యంతో కూడిన

# ఉన్నత విద్యే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం

### ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి

### ఏయూలో ఏపీ డవలప్‌మెంట్ డైలాగ్ అంశంపై సదస్సు




**ఏయూ న్యూస్, ఫిబ్రవరి :** రాష్ట్ర యువత సామర్థ్యాలపై తమకు అపారమైన నమ్మకం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రా రెడ్డి అన్నారు. శనివారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ‘ ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ డైలాగ్ ’ అంశంపై నిర్వహించిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర యువతకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహనరెడ్డి పనిచేస్తున్నారన్నారు. గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో ఉన్నత విద్యరంగాన్ని నిర్ధిష్ట లక్ష్యాలతో ముందుకు నడిపిస్తున్నారన్నారు. దాని ఫలితంగానే నేడు 12 లక్షల మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్స్ అందుతోందన్నారు. గతంలో రూ.7 వేల రూపాయలు ఉన్న స్కాలర్‌షిప్‌ని రూ.20 వేలకు పెంచినట్లు తెలిపారు. 2018లో ఇంజనీరిగ్‌లో 85 వేల మంది చేరగా, నేడు ఆ సంఖ్య 1.25 లక్షల మందికి చేరిందన్నారు. పేద ప్రతిభావంతులైన వారికి విద్యలో అవరోధాలు, ఆటంకాలు రాకుండా చూడటానికి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించడం, ప్రైవేటు విశ్వవిద్యాలయాలలో సైతం కన్వీనర్ కోటా అమలు చేయడం జరిగిందన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో జాతీయ సగటును ఏపీ అధిగమించి ముందుకు దూసుకెళ్లిందన్నారు. ఉన్నత విద్యలో ప్రవేశించే బాలికల శాతం గత మూడు సంవత్సరాల కాలంలో వృద్ధి చెందిన తీరును గణాంకాలతో సహ వివరించారు. ఇంటర్ పాసైన వారిలో నేడు అత్యధిక శాతం మంది ఉన్నత విద్యవైపు నడుస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే యువతను ఉన్నత విద్య పూర్తిచేసే దిశగా ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఫిమేల్ వర్క్‌ఫోర్స్‌లో ఏపీ దేశంలో 2వ స్థానంలో, ఫ్యూచర్ స్కిల్స్‌లో నెంబర్.1స్థానంలో, న్యూమరికల్ స్కిల్స్‌లో నెం.2 స్థానంలో నిలిచిందన్నారు. మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్ 1.20 లక్షల మంది, ఇతర సర్టిఫికేషన్‌లు 1.19 లక్షల మంది పూర్తిచేశారన్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ అవకాశాలు అందరికీ సమానమేనని, యువత మానవత్వ ఆలోచనలతో, సమాజంతో అనుసంధానం కావాలని సూచించారు. నేటితరం యువత టెక్నాలజీ అందిపుచ్చుకునే దిశగా ముఖ్యమంత్రి యువ వనరులను తీర్చిదిద్దుతున్న విధానాన్ని ప్రశంసణీయమన్నారు.

ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం సామాజిక భద్రత కల్పించే విధంగా పలు పథకాల ద్వారా నగదు నేరుగా లబ్దిదారులకు అందించడం జరుగుతోందన్నారు. కోవిడ్ సమయంలో ఆకలి చావులు రాష్ట్రలో లేకపోవడానికి ఇదే కారణమన్నారు. రాష్ట్ర యువతను నాణ్యమైన మానవ వనరులుగా నిలిపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ డీన్‌లు ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ఆచార్య సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.








ఏయూ న్యూస్, జనవరి : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మెస్‌లను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో మెస్‌ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. విద్యార్థులతో మెస్‌ల నిర్వహణపై చర్చించారు. భోజన నాణ్యత, రుచి, సమయపాలన, సిబ్బంది పనితీరు వంటి అంశాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మెస్‌లో అందిస్తున్న భోజనం పట్ల సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల హాస్టల్స్‌కి వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ సిబ్బంది పనితీరు, విద్యార్థుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ తో పాటు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణ రావు, చీఫ్ వార్డెన్ డాక్టర్ చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

# వర్సిటీ మెస్‌లలో రిజిస్ట్రార్ ఆకస్మిక తనిఖీ

ఏయూ న్యూస్, జనవరి : ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్, ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల మెస్‌లని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి అక్కడే భోజనం చేసి భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారీ విధానాన్ని కిచెన్‌కి వెళ్లి పరిశీలించారు. తరచూ మెస్‌లను వార్డెన్లు, సహాయక వార్డెన్లు తనిఖీలు చేయాలని, విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో, రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించే దిశగా నిరంతరం పనిచేయాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. రిజిస్ట్రార్ వెంట చీఫ్ వార్డెన్‌లు ఆచార్య వీర్రాజు, ఆచార్య కె.రమేష్ బాబు తదితరులు ఉన్నారు.



## పర్యావరణహిత జీవనంలో
# ఆదివాసీలు ఆదర్శణీయం






ఏయూ న్యూస్, జనవరి : పర్యావరణహిత జీవనంలో ఆదివాసీలు ఆదర్శణీయమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ఎం.ముత్యాలనాయుడు అన్నారు. ఇటీవల ఏయూ టిఎల్ఎన్ సభ సమావేశ మందరింలో ఏయూ అణుభౌతిక శాస్త్ర విభాగం, వనవాసి కళ్యాణ ఆశ్రమం సంయుక్తంగా నిర్వహించిన ట్రైబల్ హెరిటేజ్ ఇన్ ఈస్ట్రన్ ఘాట్స్ అంశంపై సదస్సులో ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసీ జాతుల్లో వైవిధ్యత ఉన్నప్పటికీ వారు పరస్పరం గౌరవించుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. లింగ విశక్షత లేకుండా స్త్రీ, పురుషులు సమాన గౌరవంతో జీవిస్తారన్నారు. వృద్ధులను, అనుభవజ్ఞులను గౌరవించడం మనం వారి నుంచి నేర్చుకోవాలన్నారు. వారిలో లాభాపేక్ష అనేది ఎన్నడూ కనిపించదన్నారు. ప్రకృతికి హని కలిగించకుండా జీవించడం వారి నుంచి నేర్చుకోవాలన్నారు. ఇలాంటి మంచి సుగుణాలు కలిగివున్న ఆదివాసీలు పట్టణాల్లోని, మైదాన ప్రాంతాల్లోని ప్రజల కన్నా ఎంతో దార్శినికులుగా నిలుస్తారన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సహజత్వం అనేది కేవలం ఆదివాసీలలోనే దర్శనమిస్తుందన్నారు. కల్మషం లేని స్వచ్ఛమైన చిరునవ్వు, ప్రేమ వారు నిదర్శనమన్నారు. ఆధునికత ఎంత పెరిగినా మన సంస్కృతులను మరువరాదన్నారు. ఆదివాసీ సంస్కృతిని, వారి జీవనాన్ని తెలయజేసే విధంగా ఇటువంటి సదస్సులు మరిన్ని నిర్వహించాలని సూచించారు. దీనికి ఏయూ సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందన్నారు. ఏయూ మాజీ వీసీ ఆచార్య కె.నాగేశ్వరరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఏయూ న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ పి.వి.లక్ష్మీనారాయణ, శక్తి డైరెక్టర్ డాక్టర్ పి.శివ రామకృష్ణ, డాక్టర్ పి.శంకర రావు, శ్యాంప్రసాద్, తదితరులు ప్రసంగించారు.

# ఐఐసీహెచ్ఇ ఫెలోగా ఆచార్య జీఎంజే రాజు

ఏయూ న్యూస్, జనవరి : ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యుడు ఆచార్య జీఎంజే రాజు అరుదైన ఘనతను సాధించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ ప్రతిష్టాత్మక ఫెలోగా ఎంపికయ్యారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఆయన ఇటీవల అందుకున్నారు. ఇంజినీరింగ్ నాలెడ్జ్- ప్రాక్టీస్ రంగంలో ఆయన మూడు దశాబ్దాలుగా అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఆయనను ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్ ఫెలోగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆచార్య రాజుని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ప్రతిష్టాత్మకమైన ఐ.ఐ.సి.హెచ్.ఈ ఫెలోగా ఎన్నిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అతి తక్కువ మందికి ఐఐసిహెచ్ఎ ఫెలోగా గుర్తింపు వస్తుందన్నారు. దీనిని ఆచార్య రాజు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.




# స్టార్టప్ రంగంలో ఏయూ ప్రగతి

▶▶ మొదటి పేజీ తరువాయి

ప్రసాదరెడ్డికి తెలియజేశారు. ఏయూ స్టార్టప్ వ్యవస్థ ఎంతో వేగంగా ప్రగతిని సాధిస్తోందన్నారు. పర్డు యూనివర్సిటీకి సారూప్యత కలిగిన విధంగా ఇక్కడ వసతులు, వనరులు ఉన్నాయన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఎంటర్‌ప్యూనర్ ఎకో సిస్టమ్ నిర్మించి, అభివృద్ధి చేసిన విధానం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. విశాఖ నగరం ఎంతో సుందరంగా ఉందన్నారు. విశాఖలో తన అనుభూతులను ఆమె వీసీతో పంచుకున్నారు. పర్డుయూనివర్సిటీ గత 12 సంవత్సరాలుగా స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలలో పనిచేస్తోందన్నారు. ఏయూలో కేవలం రెండు సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి 150కిపైగా స్టార్టప్ సంస్థలు ఇక్కడ యాక్టివీవ్‌గా పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ పర్డు యూనివర్సిటీతో సంయుక్తంగా కోర్సులను నిర్వహించే దిశగా కృషి చేయాలని సూచించారు. రెండు వర్సిటీలు సంయుక్తంగా డబుల్ డిగ్రీ, ట్విన్నింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించే దిశగా పనిచేయాలన్నారు. అనంతరం జూలియాన కాసవాన్‌ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆ - హబ్ సిఈఓ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారిణికి అభినందన



**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల విద్యార్థిని కె.శ్రీవర్షితను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అభినందించారు. ఇటీవల జరిగిన ఖేలో ఇండియా పోటీలలో బాక్సింగ్ 45-48 కేజీల విభాగంలో వర్షిత కాంస్య పతకం సాధించింది. శ్రీ చాణక్య డిగ్రీ కళాశాలలో బిబిఏ చదువుతున్న వర్షిత క్రీడాకారిణిగా జాతీయ స్థాయిలో రాణించడం పట్ల వీసీ ప్రసాదరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య భరతలక్ష్మికి జాతీయ పురస్కారం



**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయం జువాలజీ విభాగం ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్న ఆచార్య బి.భరతలక్ష్మికి జాతీయ పురస్కారం లభించింది. జంతుశాస్త్ర రంగంలో చేసిన విశేషమైన కృషికిగాను బిష్వమోయ్ బిస్వాస్ జాతీయ గోల్డ్ మెడల్‌ని జూలాజికల్ సొసైటీ ఆమెకు ప్రధానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఆచార్యులు సాధించే పురస్కారాలు వర్సిటీకి పేరు ప్రతిష్టలు తీసుకువస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆచార్య భరతలక్ష్మికి పలువురు ఉన్నతాధికారులు, విభాగ ఆచార్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

## మొక్కలు నాటిన వీసీ ప్రసాదరెడ్డి



**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మొక్కలు నాటారు. ఏయూ తెలుగు విభాగం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఇటీవల ఆ విభాగ ఆచార్యులతో కలిసి తులసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు జర్రా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిమార్గం చూపిన మహనీయుడు గాంధీ



**ఏయూ న్యూస్, జనవరి :** శాంతి , క్షమాగుణం, ప్రేమ ప్రపంచానికి అందించిన మహనీయుడు గాంధీ అని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఇటీవల గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన హరిత గాంధేయం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ స్వేచ్ఛను ఆస్వాదిస్తున్న మనం స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసినవారిని గుర్తు చేసుకోవాలన్నారు. గాంధీజీ తత్వాన్ని, ఆలోచనలను నేటి తరానికి అందించే విధంగా కేంద్రం సేవలు అందించాలని సూచించారు. గాంధీజీ, అంబేద్కర్ ఆలోచలన మధ్య సారూప్యతలను వివరించారు.

ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ ఆచరణాత్మక మార్గాలను గాంధీజీ చూపారన్నారు. స్వార్థం, స్వప్రయోజనం, హింస నేటి సమాజంలో విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. కుల, మత, ప్రాంతాల వారీగా ప్రజలు విడిపోతున్నారని, ఇది ఎంతమాత్రం సమర్ధనీయం కాదని అన్నారు. మహనీయుల త్యాగాలను, వారి ఆలోచన సరళిని నేటితరం యువత తెలుసుకోవాలని సూచించారు.

కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతా మాణిక్యం మాట్లాడుతూ ఉత్తమ వ్యక్తిత్వ లక్షాలు కలిగిన సంపూర్ణ రూపంగా గాంధీజీ నిలుస్తారన్నారు. గాంధీజీ ప్రసంగాలు, ఆయన తత్వం తెలుసుకునే ప్రతీసారీ మనం నూతన స్ఫూర్తిని పొందడం జరుగుతుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ గాంధీజీ ఆలోచనలను వివరించారు. డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, గాంధీ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య ఏ.బి.ఎస్.వి.రంగారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి తదితరులు ప్రసంగించారు.



# ఏయూను సందర్శించిన ఎన్ఐటీ రూర్కెలా విద్యార్థులు

**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ఎన్ఐటి రూర్కెలా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ అట్మాస్ఫియరిక్ సైన్స్ విద్యార్థులు ఇటీవల సందర్శిచారు. ఈ సందర్భంగా పురాతనమైన మీటిరియాలజీ-ఓష్ణనోగ్రఫీ విభాగంలో ఉన్న వసతులు, మౌళిక వసతులు, ప్రాజెక్టులు, మెబైల్ పొల్యూషన్ టెస్టింగ్ పరికరాలు ప్రత్యక్షంగా వీక్షించారు. విభాగ ఆచార్యులు, బోధన, పరిశోధన వసతులను పరిశీలించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన విభాగాన్ని సందర్శించడం, ఇక్కడ ప్రత్యేకతలను తెలుసుకోవడం పట్ల ఎన్ఐటి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల బృందం ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.సునీత, ఆచార్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## వీసీ అభినందించిన జోగినాయుడు, రెహ్మాన్



**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డిని సినీ నటుడు జోగినాయుడు అభినందించారు. 2వ సారి వీసీగా నియమితులైన నేపథ్యంలో ఇటీవల వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని ఆయని కార్యాల యంల కలిసి అభినందనలు తెలియజేశారు. చైతన్య స్రవంతి సంస్థ అద్యక్షురాలు శిరీన్ రెహ్మాన్, మాజీ శాసన సభ్యులు ఎస్.ఏ. రెహమాన్ దంపతులూ కూడా వీసీ కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు.



# ప్రతి విజయంలో.. కష్టాన్ని గుర్తించాలి



**ఏయూ న్యూస్, జనవరి :** ప్రతి వ్యక్తి విజయం వెనక ఎనలేని కష్టం దాగి ఉంటుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ఇటీవల ఏయూ తెలుగు విభాగంలో డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి జాతీయ సదస్సు నిర్వహించారు. ముందుగా మాలతీ చందూర్ చిత్ర పటానికి వీసీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ మాలతీ చందూర్ సాహిత్యం సమాలోచన పేరిట జరిగిన ఈ సదస్సులో వీసీ మాట్లాడుతూ వ్యక్తి విజయాన్ని మనం చూస్తాం కానీ దాని వెనక పడ్డకష్టాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయమన్నారు. మాలతీ చందూర్ సాహితీ ప్రస్థానం వెనక ఎంతో శ్రమ దాగుందని, దానిని తెలుసుకుని, పరిశోధించే ప్రయత్నం జరగాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి గతంలో దశాబ్దకాలం పాటు పడ్డకష్టాలు, ఆయన ఆశయ సాధన కోసం చేసిన కృషి తనకెంతో ఇష్టమన్నారు. ఏయూలోని వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తెలుగు విభాగంలో ధర్మనిధి ప్రసంగాలను ఏర్పాటు చేయడానికి కృషి చేసిన హిందీ విభాగం ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆచార్య యార్లగడ్డలక్ష్మీ ప్రసాదకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ స్ఫూర్తితో తెలుగు విద్యార్థులు రచనా రంగం వైపు ప్రయాణించి మంచి రచనలతో సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్ర సృష్టిస్తుందన్న గురజాడ మాటకు నిలువెత్తు నిదర్శనంగా మాలతీ చందూర్ జీవితం నిలుస్తుందన్నారు. చిన్నప్పుడే చదువుకు దూరమై, వివాహం తర్వాత భర్త ప్రోత్సాహంతో లోకాన్ని చదివి సాహిత్యం వైపు ప్రయాణం చేసి, ప్రతి నవలలో స్త్రీనే కథానాయికగా చేసి సమస్యతో పాటు పరిష్కార మార్గాన్ని తెలియజేసిన మహావ్యక్తి మాలతీ రందూర్ అని కొనియాడారు. విభాగాధిపతి ఆచార్య ఇర్రా అప్పారావు, ప్రముఖ కథకులు ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహన్ బాబు, డాక్టర్ బి.వెంకటస్వామి, అన్నంశెట్టి ఈశ్వరమ్మ, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ వయస్సు పెంపుపై
# ఉద్యోగులు హర్షం



▶▶ మొదటి పేజీ తరువాయి

చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, దీనిలో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగులు అందరూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.వి.రమణారెడ్డిగారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగస్తులతో సమానంగా ఎ.పి.లో వున్న అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న ఉద్యోగులందరుకు పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచడం చాలా అనందదాయకంగా వుందన్నారు. మాటతప్పని మడమ తిప్పని నాయకుడుగా పేరు గాంచిన మన ప్రియతమ మంత్రివర్యులు గౌరవనీయులు వైయస్ జగన్మోహనరెడ్డికి ఇందుకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యాశాఖ మంత్రకి, కేబినిట్ మంత్రులకు, ఈ పదవీ విరమణ వయస్సు పెంపుకు తనవంతు సహాయ సహకారాలందించిన ఆంధ్రాయూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య పి.వి.టి.డి. ప్రసాద రెడ్డికి, రిజిస్ట్రారు ఆచార్య జేవమ్స్ స్టీఫెన్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉద్యోగులందరూ స్వీట్స్ తినుపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు త్రినాథరెడ్డి, ఎం.లక్ష్మణ్ రెడ్డి, కె. మంగరాజు, ఎం.రాంబాబు, ఎం.అప్పలనాయుడు, శంకరరెడ్డి, శ్రీనివాసరావు, ఈశ్వరరెడ్డి, ఆదినారాయణ, వి. కనకరాజు. పోలారావు, సురేశ్, శ్రీనివాస్, ఇమామ్‌లతో పాటు వర్సిటీ ఉద్యోగులు, ఆంధ్రాయూనివర్సిటీ వై.యస్.ఆర్. అభిమానులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# 6న ఏయూలో నిక్ ఉజిసిక్ స్ఫూర్తిదాయక ప్రసంగం



**ఏయూ న్యూస్, జనవరి :** ప్రపంచాన్ని తమ స్ఫూర్తిదాయక ప్రసంగాలతో సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తున్న ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ ఉజిసిక్ ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తున్నారు. 6వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో యువతను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం అందించనున్నారు. చిన్నతనంలో చేతులు కాళ్లు లేకుండా జన్మించిన నిక్ తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో ఒక్కోమెట్టు ఎక్కుతూ ఉన్నత విజ్ఞానాన్ని సాధించారు. తన జన్మకు ఒక లక్ష్యం ఉందని నిర్ణయించుకుని దానిని చేరుకునే ప్రయత్నం చేశారు. ఈ మార్గంలో ఎన్నో అవరోధాలు, అవమానాలు ఎదురైనా నిక్ వెనుదిరిగి చూడలేదు. కాళ్లుచేతుల లేకపోయినా మొక్కవోనిదీక్షతో ఈత కొట్టడం, సర్ఫింగ్ చేయడం, గోల్ఫ్ ఆడటం, నోటిలో పెన్ను పెట్టుకుని రాయడం, కాలి వేళ్లతో టైపింగ్ చేయడం వంటి విభిన్న సామర్థ్యాలను అందిపుచ్చుకున్నాడు. ఈ క్రమంలో ఒక మంచి వక్తగా కూడా ఆయన పేరుతెచ్చుకున్నాడు. అన్ని అవయవాలతో జన్మించి అవకాశాలు ఉన్నా క్షణికావేశంలో చిన్నపాటి కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువతకు నిక్ జీవితం ఒక ప్రేరణగా నిలుస్తుంది. నేడు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి నిక్ తన ప్రసంగాలతో స్ఫూర్తిని నింపుతూ మనలోని శారీరక, మానసిక వైకల్యాన్ని, అవరోధాలను అధిగమించి ముందకు సాగాలని చాటుతున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 6వ తేదీన విశాఖ నగరానికి వస్తున్న నిక్ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఉత్తరాంధ్రకు చెందిన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. యువతకు స్ఫూర్తిని అందిస్తూ మోటివేషనల్ స్పీకర్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిక్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి యువతకు అవకాశం కల్పిస్తున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు




**ఏయూ న్యూస్, జనవరి :** జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ జాతీయ సేవా పథకం వలంటీర్లు భాగస్వాములుకానున్నారు. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు పంజాబ్‌లోని పటియాలాలో చిత్కర విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూకు చెందిన 10 మంది వలంటీర్లు, ఒక ప్రోగ్రాం అధికారి హాజరవు తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అభినందనలు తెలిపారు. జాతీయ సేవా పథకం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఉపయుక్తంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తదితులు పాల్గొన్నారు.

# ఏయూ అభివృద్ధి రాష్ట్రవర్సిటీలకు ఆదర్శం




**ఏయూ న్యూస్, ఫిబ్రవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని గత నాలుగున్నరేళ్లుగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అభివృద్ధి చేసిన విధానం ఆదర్శనీయమని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఏయూని సందర్శించిన ఆయన ఉన్నతాధికారులతో పాలక మండలి సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూ సాధించిన అభివృద్ధి ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. నాక్ పర్యటన సందర్భంగా 3.74 స్కోర్ సాధించడం రాష్ట్ర ముఖ్యమంత్రికి అత్యంత ఆనందాన్ని కలిగించిందన్నారు. అన్యాక్రాంతమైన కోట్లు విలువచేసే ఏయూ భూములను స్వాధీనం చేసుకోవడం అసాధారణ విషయమన్నారు. ఆచార్య ప్రసాదరెడ్డి విజన్‌ని అర్థం చేసుకుంటూ వర్సిటీ అధికారులు, ఉద్యోగులు ఏయూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా చేసిన అభివృద్ధిని నిలుపుకుంటూ మరింత ప్రగతి సాధిస్తామన్నారు. ఏయూ ఉన్నత విద్యామండలి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్స్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆచార్య హేమచంద్రరెడ్డిని ఏయూ తరపున సత్కరించారు.

# పూర్వవిద్యార్థులు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలవాలి



**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చదువుకుని ఉన్నత స్థానాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలవాల్సి అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఇటీవల తన కార్యాలయంలో భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న లవణ్‌కుమార్ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని ఆయని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూ పూర్వవిద్యార్థులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో అత్యున్నత స్థానాలలో స్థిరపడటం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా లవణ్‌కుమార్‌కి అభినందనలు తెలిపారు. అనంతరం ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో న్యాయకళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో లవణ్‌కుమార్ పాల్గొన్నారు. పోటీ పరీక్షలకు – యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం కావడం, న్యాయ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అంశంపై ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో న్యాయ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. తాను ఇక్కడ విద్యార్థిగా చదువుకుని నేడు కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న విధానం, దీనికి తాను పడ్డ శ్రమ, కష్టాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల చక్కని ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధంకావాలన్నారు. న్యాయ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకరరావు, వగీర తదితరులు పాల్గొన్నారు.

# ఒక స్టార్టప్ ఆవిష్కరణ ప్రపంచాన్ని మార్చగలదు

## ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్





**ఏయూ న్యూస్, జనవరి :** స్టార్టప్ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు మేధోహక్కుల పరిరక్షణ అత్యంత ఆవశ్యకమైన అంశమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఇటీవల ఏయూ డిపిఐఐటి – ఐపిఆర్ ఛైర్, ఆ హబ్, ఆంధ్రయూనివర్సిటీ, పర్డు యూనివర్సిటీ(యుఎస్ఏ) సంయుక్తంగా ఐపి అండ్ స్టార్టప్స్ అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో జరిగే ఒక నూతన ఆవిష్కరణ ప్రపంచ గతిని మార్చగలదన్నారు. ఆలాంటి ఆలోచన దిశగా యువతను ప్రోత్సహించాలన్నారు. ఆయా ఆవిష్కరణలకు పేటెంట్‌లు సాధించడమూ ఎంతో అవసరమన్నారు. తద్వారా యువత తమ మేధస్సు నుంచి చేసిన నూతన ఆవిష్కరణలకు తగిన గుర్తింపు, గౌరవ, విలువ లభిస్తాయన్నారు.

పర్డు యూనివర్సిటీ ఎంటర్‌ప్యూనర్‌సిప్ ప్రోగ్రాం కన్సల్టెంట్ జూలియాన కెసావన్ మాట్లాడుతూ పర్డు యూనివర్సిటీలో మేధో హక్కుల పరిరక్షణకు అవలంభిస్తున్న విధానాలను వివరించారు. ఆవిష్కరణలకు పేటెంట్‌లు సాధించడం, వాటని కమర్షియలైజేషన్ చేయడం వలన వర్సిటీకి ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చున్నారు. ఐపిఆర్ ఛైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం మాట్లాడుతూ దేశీయంగా విశ్వవిద్యాలయాలలో ఐపిఆర్‌పై తగిన అవగాహన లేదన్నారు. వీటిపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని పలు ఉదాహరణలతో సహ వివరించారు. ఐపిఆర్ కోసం ప్రతీ విశ్వవిద్యాలయంలో వసతులు, వనరులను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముందన్నారు. స్టార్టప్ రంగలో ఉన్నవారు 2016 నుంచి స్టార్టప్ ఇండియా ప్రోగ్రాం ఫలితంగా 10వేలకు పైగా పేటెంట్‌లకు దరఖాస్తు చేయడం, 30వేలకు పైగా ట్రేడ్ మార్క్‌లను రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. స్టార్టప్‌లకు ఒక వ్యూహాత్మక సాధనంగా ఐపిఆర్ నిలుస్తుందన్నారు. ఒక సారి పేటెంట్ సాధిస్తే ఆ సాంకేతికతపై ఆవిష్కర్తకు 20 సంవత్సరాల వరకు హక్కులు ఉంటాయన్నారు. పేటెంట్ సాధించకుండా మార్కెట్‌లోకి తమ ఉత్పత్తులను ఎవరూ విడుదల చేయకూడదని సూచించారు. అనంతరం ఎన్‌ఆర్‌డిసి సీనియర్ రీజినల్ మేనేజర్ డాక్టర్ బి.కె సాహు, ఆ–హబ్ సిఈఓ రవి ఈశ్వరపు, నోవెల్ పేటెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి హిమ బిందు, సైఫ్ ఆటోమేషన్స్ సర్వీసెస్ సిటిఓ ఆలీయాస్గర్ తదితరులు ప్రసంగించారు. స్టార్టప్, పేటెంట్ అంశాలను సోదాహరణంగా వివరించారు. ఈర్యక్రమంలో వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు, స్టార్టప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏయూ అమెరికన్ కార్నర్ పనితీరు ప్రశంసనీయం

**ఏయూ న్యూస్, జనవరి :** ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని అమెరికన్ కార్నర్ పనితీరు, అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని యుఎస్ కాన్సులేట్(హైదరాబాద్) పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెన్ అన్నారు. ఇటీవల ఆయన ఏయూలోని అమెరికన్‌కార్నర్ సెంటర్‌ను సందర్శించారు. కేంద్రం ఏర్పాటు అయిన నాటి నుంచి నిర్వహించిన వివిధ కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏయూ రిజిస్ట్రార్, అమెరికన్ కార్నర్ మెంటర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమెరికన్ కార్నర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను తెలుసుకొని సెంటర్ పనితీరుపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం విశాఖలో జరిగే మిలాన్ కార్యక్రమంలో అమెరికా దేశ నౌకలు పాల్గొంటాయని, దీనిలో భాగంగా 400 మంది వరకు సెయిలర్స్ విశాఖకు వస్తారని తెలిపారు. వీరు ఏయూను సందర్శిచాలని ఆసక్తి చూపుతున్నారని, వీరి పర్యటనకు అనుగుణంగా విద్యార్థులతో అనుసంధానం చేస్తూ విభిన్న కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. దీనితో వచ్చే నెలలో తాము సమగ్ర ప్రణాళికతో వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఎస్ కాన్సులేట్(హైదరాబాద్) మిలిస్సా నందుల, జో క్రిష్టోఫర్, ఏయూ ఐపీఆర్ ఛైర్ ప్రొఫెసర్ తదితరులు పాల్గొన్నారు.



Chief Patron Prof. P.V.G.D. Prasada Reddy, Chief Editor Prof K.Samatha,Publisher Prof V. Krishna Mohan, Chief Advisor Prof James Stephen, Technical Adviser D.Sivakumar Reddy, Editorial Team Dr. Challa Rama Krishna, Prof. D.Lalitha Bhaskari, Dr. T.Vijaya Lakshmi, Mr. V.V.S.V Narasimham, Dr. Ch. Satyanarayana, Andhra University South Campus, Visakhapatnam, Andhra Pradesh, India, Pin: 530 003, Phone : 0891-284422